


# కాలం మాన్పిన గాయం

శ్రీమతి ధనలక్ష్మీభాస్కరం

గుళ్ళో విన్న పురాణాన్ని మననం చేసుకుంటూ గడపలో అడుగు పెట్టాను. సావిట్లో కాలు పెడుతూనే కనబడ్డ దృశ్యం చూసి ఆశ్చర్యపోయాను.

అమ్మా, నాన్నా, అన్నయ్యా, వదినా అందరూ గుమిగూడి కూర్చున్నారు. వారేదో తీవ్రంగా ఆలోచిస్తున్నట్టు వారి ముఖాలే చెబుతున్నాయి. అన్నయ్యగారి నాలుగేళ్ళ పాప నాకెదురుగా పరుగెత్తుకొచ్చి 'అత్తా, నన్ను తీసుకెళ్ళవూ, నీతో' అంటూ నా కాళ్ళకి చుట్టుకుంది.

'ఇదేమిటే, ఇప్పుడు నేనెక్కడికి వెళుతున్నానే?' అని దాన్ని సముదాయిస్తూ, రెక్క పుచ్చుకుని తీసుకొని నాన్న దగ్గిరికెళ్ళేను.

'అమ్మా, పురాణం ఏం చెప్పేరే?' అని అమ్మ పలకరించింది.

'రాసక్రీడలమ్మా ... ఎంత బాగా చెప్పేరనుకున్నావూ' అన్నాను, సంగతేమీ బోధపడక, నా ధోరణిలో నేను.

మరెవరూ మాట్లాడలేదు – ఒక నిమిషం.

అప్పటికి తెలిసింది, ఆ ప్రశ్న కేవలం నన్ను సంభాషణలో దించడానికేననీ, వాళ్ళేదో చెప్పబోతున్నారనీ, ఏదో చెప్పబోతూ, ఎలా చెప్పాలో తెలియక తికమక పడుతున్నారని. ఒదిన నా వేపు కొంటెగా చూసి ఏదో మాట్లాడబోయి, మధ్యలో అన్నయ్య మొహంలో ఏదో గాంభీర్యం చూసి ఆగింది.

నాన్నగారే గొంతుక సర్దుకొని 'చూడమ్మా, శాంతా, మీ మామగారు ఉత్తరం రాసేరు' అన్నారు కాగితం నాకందిస్తూ.

అమాంతం పిడుగుపడ్డట్టు అదిరిపడ్డాను. కాగితం అందుకున్నానే గాని నా చెయ్యి ఆ కాగితాన్ని నిప్పును వదిలించినట్టు పడేసేటట్టుంది. కళ్లు అక్షరాలు చదవాలనుకుంటూ చీకట్లు కమ్ముతున్నాయి. అందులో వున్నదేదో ఎవరేనా చెప్పేస్తే సుఖమనిపిస్తోంది.

'అయిందేదో అయింది; అబ్బాయి తిరిగి వొచ్చాడు; పాతవన్నీ మరిచిపోయి, శాంతని తీసుకురమ్మంటూ వ్రాసేరమ్మా' అన్నారు నాన్న.


నేనేమీ అనలేదు. అందరి మొహాల వేపూ వెర్రిగా చూస్తున్నాను. వాళ్ళందరూ నేనేం చెబుతానో అని వుత్కంఠతో చూస్తున్నట్టుంది

మళ్ళీ నాన్నే 'నీ యిష్టమమ్మా' అన్నారు 'నాకు మాత్రం నిన్నా కసాయివాడి దగ్గిరికి పంపడానికి మనస్సంగీకరించడంలేదు. మనకేమీ లోటు లేదమ్మా... అన్నయ్యతో బాటు నువ్వూ ఒక మొగపిల్లాడనుకుంటాను. కాని మీ అమ్మే. పంతాలతో బతుకులు పాడుచెయ్యొద్దంటోంది. మళ్ళీ నీ కాపురం కుదటపడి దేవుడు రక్షించి నీ కడుపుని నాలుగుకాయలు కాస్తే ఒచ్చిన కష్టం మరిచిపోతావంటుంది. ఆలోచిస్తూన్నకొద్దీ అది సమంజసంగానే తోస్తూంది. నీ అత్త మావలిద్దరూ సౌమ్యులే. తులసివనంలో గంజాయిమొక్క మనపాల బడింది.'

నేను అమ్మ వేపు చూశాను. ఆలోచనతో, ఆవేదనతో అమ్మ కళ్ళు కుంకుమ రంగు పులుముకున్నాయి.

అందరూ ఎప్పటి ఆత్రుతతో. నే చెప్పే సమాధానంకోసం కాచుకొని ఉన్నారు.

'భోజనానికి లేవండి నాన్నా–ఆనక మాట్లాడుకుందాం' అని అన్నయ్య




లేచాడు. సమస్య తక్షణమాత్రం వాయిదా పడ్డది.

భోజనాల దగ్గిర ఎవరూ ఏమీ మాట్లాడలేదు. అందరికీ యిదే సమస్య అయిపోయినట్టు స్ఫురించి నా దురదృష్టానికి నేనే బాధపడ్డాను, సిగ్గు పడుతున్నాను.

నాన్న డాబామీదికి వెళుతూ "తొందర్లేదమ్మా, తాపీగా ఆలోచించుకో, అతనికీ, మాకూ, లోకానికీ నచ్చినా నీకు నచ్చడం ప్రధానం. గాయం నీది గనక బాధ నీకెక్కువ తెలుస్తుంది. తీరుబాటుగా ఆలోచించి ఏదో ఒక నిర్ణయంచేసుకో. చేసుకున్న నిశ్చయం మారకుండా చూసుకో!" అన్నారు.

నాన్న మాటలూ, దానికాకారణం కారణాని క్కారణాలూ అన్నీ ఒక్కత్తినే ఆలోచించుకుంటూ పక్కమీద వాలేను. ఈ హాల్లో ఇలా ఎన్నేళ్ళ నుంచీ పడుకుంటున్నాను! చింత లేక పోవడంవల్ల కాకపోయినా గుండె రాయి అయిపోవడంవల్ల పక్కమీద వాలగానే నిద్ర పట్టేది.

ఈ రాత్రి నా జీవితానికి కాళ రాత్రిగా నిద్ర రాదేం! ఆశలూ ఆశ్వాసాలూ సృష్టించుకుంటూ మిద్దెవేపు చూస్తూ పడుకున్నాను.

'పదేళ్ళకిందట ఆయన్ని మొదట చూడ్డం జరిగింది... పెళ్ళికోసం మావాళ్ళింకా గట్టి ప్రయత్నాలు చెయ్యడం లేదు. యదాలాపంగా వచ్చిన సంబంధం

చూదాం, తప్పేముం' దని నాన్న తీసుకొచ్చేరు. 'పిల్ల నచ్చింది; చేసేట్ట యితే మా అభ్యంతరం' లేదని వాళ్లు మూడోరోజునే కబురు పెట్టేరు.

నా పెళ్ళి! పదహారేళ్ళయినా నిండని నాకు పెళ్ళి! అందులోనూ కలిగున్న కుటుంబంలో పడుతున్నాను! అంతా అదృష్టవంతురా అంటే నిజంగా అదృష్టవంతురాలే అన్నారు. నలుగురూ నాలుగు రకాలుగా ఒచ్చిన సంబంధాన్ని మెచ్చుకోడంతో ఒదల బుద్ధెయ్యలేదు నాన్నకి ఎప్పుడో ఒకప్పుడీ బరువు వొదుల్చుకోవాలి గదా, పిల్ల ఎదక్కపోడం వో పెద్ద భయమా; ఆడపిల్లా అరిటిచెట్టూ ఎంత నేపు ఎదగాలి అన్నారు నాన్న.

పెళ్ళి వైభవంగా జరిగింది. అచ్చట్లూ ముచ్చట్లూ ఒక్కగా నొక్క ఆడపిల్లకి జరగవలసినట్టూ జరిగేయి. నాన్న పాలల్లో ముంచి నా చెయ్యి అప్పగిస్తూ కళ్ళ నీళ్లు కార్చేరు. కన్నీరు చూస్తే కన్నీరొస్తుంది. ఏడుపే వొస్తున్న కళ్లు పైకెత్తి చూసేసరికి చిరునవ్వుతో నావేపు చూస్తున్న ఆయన మూర్తి కనుపించింది. అందులో నేనున్నాను నీకేం భయం అన్న భరవాసా ఉంది ఆ కళ్ళలో భరవాసాతో యిహ లోక యాత్ర నిరాఘాటంగా సాగించొచ్చు ననిపించింది. అత్తింట్లో అడుగు పెట్టీ పెట్టగానే అత్తయ్య హారతులెత్తి మా యింటికి లక్ష్మివని పొంగిపోతే నా కింక లోటేమిటని అనిపించింది.

*　　　*　　　*

ఎంత సున్నితంగా ప్రవర్తించేవా రాయన! అదంతా నిజమైన మెత్త దనం కాదనీ, అనుభవం వల్ల వచ్చిన నటననీ నా కప్పట్లో ఏం తెలుసు?

ఆ కారణం ఈ కారణం చెప్పేసి వొంటిమీది నగలు ఒక్కొక్కటే ఓలు చుకుపోతే యిదంతా ఏదో లాభసాటి బేరమే చేస్తున్నారు, బొత్తిగా ఏమీ లేకుండా వ్యాపారం చేస్తున్నారా అని ధైర్యం చెప్పుకునేదాన్ని.

అక్కడికీ అత్తగారు చెబుతూనే వుండేది - వాడు పెట్టే ఖర్చులకు వో అర్థమంటూ వుండదు; సొమ్ము విష యంలో వాణ్ణి దిద్దుకుంటేనే నీయిల్లు దిద్దుకున్నట్టమ్మా అని-కాని అప్పటికే చెయ్యి జారిపోయింది. నవ్వించీ కవ్వించీ నటించీ ముఖ్యమైనవన్నీ పట్టే శారు

ఓరోజు వొళ్లెరక్కుండా వున్న స్థితిలో ఆయన్ని మోసుకొచ్చి వాకిట్లో పడే శారు... మైకంలోవున్నా మాటలొస్తు న్నాయి. పలవరింతలయినా పలకరింపు లేకుండా సంగతంతా తేలుస్తూనే వుంది. ఏ కొంపల్లోనో తిరిగి, ఏమేమో తాగి, ఎక్కడెక్కడో దొర్లుతున్న స్థితిలో దొరికినట్టున్నారు. ఇవతల ఆయన్ని

బ్రతికించి మళ్ళీ మామూలు మనిషిని చేసే ప్రయత్నం చేసుకోడమా, అత్తా, మామా, పెట్టే చివాట్లు వినడమా? నీమూలాన్నే వాడింత చెడిపోయాడు, వాడికి డబ్బు అందనివ్వద్దంటే విన్నావు గావు; అని సారాంశం. ఒక్కసారి హృదయం పగిలి ముక్కలైంది. తల వ్రక్కలైతే బాగుంటుం దనిపించింది.

నాన్న యాదాలాపంగా నన్ను చూడ్డానికనివచ్చి ఇదంతా విని నన్ను తీసుకొని వచ్చేశారు. కలిగిన అనుబంధానికి ఫలితంగా కలగబోయే ఆనందాన్నీ పుట్టబోయే ప్రేమమూర్తినీ తల్చుకుంటూ ఆనందించవలసిన యీ రోజుల్లో యీ వ్యథ వల్ల బ్రతుక్కే తీరని అన్యాయం జరిగింది.

మరి రెణ్ణెల్లకే బాబు పుట్టేడు. వాణ్ణి చూసుకుంటూవుంటే కొంత బాధ తగ్గినట్టు అనిపించింది. చిలిపి కళ్లూ, పాలబుగ్గలూ ముద్దులు మూట కడుతూ వున్న బాబుని చూసుకుని భగవంతుడిచ్చిన వరప్రసాదమే అని మురిసిపోయాను. వాడి చిలిపిచేష్టలూ చిన్నమాటలూ వింటూ మనసులోని గాయాన్ని చాలావరకూ మాన్పుకొన్నాను. వాడి వచ్చీరానీ మాటల్తో నా మనస్సు కుదటబర్చుకున్నాను. అత్తయ్యా, మామగారూ వచ్చి బాబుని చూసి ఆశీర్వదించి వెళ్ళేరు. ఎవరొచ్చినా నా ఆనందం పూర్తిగా పంచుకోలేరు. ఆయనొస్తేనే తృప్తి కలుగుతుందిగదా అని ఆశించాను. ఇదిగో మన ప్రేమఫలం అని చూపిద్దామని రోజులు లెక్కబెట్టాను. వారు రానివెలితి నన్ను అనుక్షణం బాధిస్తూనే వుంది. బాబునిచూసి నేనుపొందే ఆనందంలో కొంతభాగమైనా ఆయనకి లేకపోయిందే అని కుమిలి కుమిలి ఏడ్చాను. వాణ్ణి చూడాలని కూడా ఆయనకు లేకపోయిందే అని విపరీతమైన కోపంవచ్చేది. నే నేం తప్పుచేశానని, నాకీ శిక్ష అనుకొని బాధపడేదాన్ని.

ఉత్తరాలు కావవి, ప్రార్థనలు; విన్నపాలు; వారానికో ఉత్తరంరాస్తూ. ఆయనొస్తారు; మారినమనసుతో నన్ను చేరదీసి తీసుకెళ్తారు - అన్న ఆశతో ఏళ్ళతరబడి ఎలా గడిపేశానో ఇప్పుడు తల్చుకుంటే అర్థమే కావడంలేదు. అర్థమయ్యేదల్లా ఒక్కటి - సృష్టిలో ముఖ్యమైనది ఆశ అనే వొక నల్లని నేరేడుపండు. అది లేకపోతే ఎన్ని ఆత్మహత్యలు జరుగునో; అసల మానవజాతి యింతవరకూ మిగిలుంc దేమో.

లేకపోతే దొడ్లో నేను నాటిన పూ చెట్లు విరగపూసి అరటిచెట్లు గెలc దింపెయ్యడమేమిటి; నా బ్రతు మాత్రమే మోడుబారి పోవడమేమిట ముందుగా అనుకుంటే అయిదేళ్లుకాc

గదా, అయిదునెల్లు - అయిదురోజు లైనా ఎడబాటు సహించలేం.

దేనికీ రానివాళ్ళు ఎన్ని వుత్తరాలు రాసినా సమాధానం కూడా వ్రాయని వాళ్ళు - మా చెల్లెలి పెళ్ళి అనగానే తల్లినీ తండ్రినీ తీసుకుని వస్తున్నాననీ, చిట్టిగాణ్ణి చూడాలనుందనీ తొలిరోజు ఉత్తరంరాసి మర్నాడు దిగేశారు, మావారు. నా ఆనందం ఏమని చెప్పను! ఏదో దుష్టగ్రహం నన్నో నా బాబు గాణ్ణో పట్టుకుంది; ఇన్నాళ్లూ అనుభ వించింది దాని ప్రభావమే. అదంతా పోయి యిప్పుడు మంచిరోజు లొచ్చాయి అనిపించింది, వాళ్ళకీ మగ పెళ్ళివారికీ ఏదో బంధుత్వం వుంది; అందుకని వొచ్చేరని అంతా అనుకు న్నారు. ఏమయితేనేం - నా జీవితంలో మళ్ళీ వసంతం చిగురిస్తోంది; నవఋతు వులు నాకోసం తెచ్చేరు. అప్పటి కప్పుడే బాబు 'అమ్మా, వాళ్ళ రవికి నాన్న వున్నాడు గదా మరి మననాన్న ఏడీ ?' అనీ, 'నాన్న ఆఫీసుకెళ్ళేడా?' అనీ! ఇలాటి ప్రశ్నలన్నీ నేర్చేసి నా మనస్సుని కలత పెడ్తున్నాడు. వార్ని చూపించి 'ఇవన్నీ ఆయన్నే అడగరా!' అని చెప్పగలిగిన రోజొచ్చిందిగదా అని పొంగిపోయేను.

అత్తయ్యా మామగారూ బస్తూనే బాబుని ఎత్తుకొని ఆనందబాష్పాలు రాల్చేరు. ఎన్నాళ్ళనించో ఎరిగున్నట్టు వాళ్ళతో కబుర్లు చెబుతున్న బాబును చూసి నా మనస్సు ఆనందంతో ద్రవిం చింది... నాన్నతో కలసి నేరస్తుడిలా తలవంచుకుని, వచ్చే ఆయన్ని చూస్తే చెప్పలేనంత సిగ్గుతో బాధకలిగింది. తప్పులేకుండా ఎవరికివారు శిక్ష వేసు కుంటే, యిలాగే ఉంటుంది. బాబును ఆయన ఎత్తుకోని లాలిస్తూంటే, సగం బాధ తగ్గినట్టయింది.

అంత సందట్లోనూ అత్తయ్య వేరేగా పిల్చి గోముగా 'నాతల్లీ ఎలా అయిపోయావే పాతికేళ్ళయినా రాకుండా తొంభయ్యేళ్ళ దానిలా వున్నావే! ఇహ బెంగలేదులే. ఎల్లుండి పెళ్ళి అయిపోగానే వాళ్ళంతా అటు వెళితే మనం మనింటికిపోదాం, వాడికీ మతితిరిగింది.' అని చెప్పారు. నా మన స్సులో స్వాతివానలు కురిశాయి.

మామగారు బుజ్జగిస్తూ 'ఆస్తంతా చంటాడిపేర రిజిస్ట్రీ చేయించేనమ్మా' వీడి బాధ వక్లేక అప్పుడుగదా, యిలా దారికొచ్చేడు !' అన్నారు.

'అమ్మా, మనం తాతగారూరు పోదామా' అన్నాడు బాబు.

'ఊఁ' అన్నాను, వాణ్ణి ముద్దుల్లో ముంచేస్తూ.

'అమ్మా, నాన్నెంత మంచివా రమ్మా' అన్నాడు బాబు. ఇహ వాడికి వూపిరి సలపనియ్య లేదు నేను, ముద్దు లతో.




మర్నాటి రాత్రి పందిట్లో అంతా భోజనాలు చేస్తున్నారు బాబుకి అన్నం కలిపి వాడికోసం యిల్లంతా వెతికాను కనిపించలేదు మనస్సులో కంగారనిపించి, బంతిలో వడ్డిస్తున్న అన్నయ్య దగ్గిరకు పరుగెత్తి వెళ్ళి చెప్పాను. వాడు, చూడవే నీకంగారూ నువ్వూనూ, ఎక్కడో నిద్ర పోతున్నాడేమో, అన్నాడు. కాలుగాలినపిల్లిలా తిరిగినదే తిరుగుతూ చూసిందే చూస్తూ బాబూ బాబూ అని వాపోయాను అత్తయ్యా మామగారూ అంతా, ఇటు విడిదిలోనూ అటు మాయింట్లోనూ అంతా వెతికారు సాయంత్రం వాళ్ళ నాన్నతో వెడుతూంటే చూచేమని చూసినవాళ్ళు చెప్పేరు ఆ రాత్రంతా చాలసేపు వెతుకుతూనే వున్నాం. నా మనస్సు కీడుశంకించి వెయ్యిళకా లయింది, తెల్లవార్లూ ఏడుస్తూనే వున్నాను

తెల్లవారుజామున మూడింటికి ఆయనొచ్చారు నిద్రలేక కాబోలు కళ్ళు ఎర్రగావున్నాయి. జరిగిందిచెప్పి బావురుమన్నాను బాబు తనతో రానే లేదన్నారు. తను సినిమాకి వెళ్ళొస్తున్నానన్నారు. పొద్దున్నే వెతికించు

దామని నాకేదో వ్యర్థమైన పూరట కలిగిస్తున్నారు.

ఉదయాన్నే పెళ్ళివారు వెళ్ళేరు.

కాలవగట్టంట పోతూవుండగా తండ్రినీ కొడుకునీ చూశామనీ ఎవరో సాక్ష్యం చెప్పేరుట. పోలీసులూ, మామయ్యా ఆచోకీ తీసి ఏడుగంటలయ్యేసరికి లాకులదగ్గిర దొరికిన బాబు శవాన్ని తెచ్చి వాకిట్లో పడేశారు. స్థాణువులై అమ్మా అత్తయ్యా స్పృహా తప్పిన నామీద పడి గొల్లుమన్నారు. ఋణంతీరిన బాబుకోసం విలవిల్లాడిన మనస్సుతో రోదించాను. అంతా అబద్ధమనిపించింది. అబద్ధమైతే బాగుణ్ణనిపించింది. వాడు ఏక్షణాన కళ్ళు తెరిచి అమ్మా, అంటాడోనని వెర్రిగా ఎదురుచూశాను నా ఐదేళ్ళ బాబు చావు నాలో ఆశల్ని మొగ్గలోనే తుంచేసింది.

పోలీసులు ఆయన్ని అరెస్టుచేశారు.

క్షణంలో పెళ్ళివారిల్లు దౌర్భాగ్యపు కొంప అయిపోయింది. ఒచ్చే పోలీసూ, పోయేపోలీసూ వాంఙ్మూలాలు యివ్వమనడం, రాసిందే రాసుకోడం, అడిగిందే అడగడం ఈ యాతనంతా పోయిన నా పాపణ్ణి నాకివ్వగలదా? పైగా నా బిడ్డని కాలవలో పడేసి చంపేరన్న అపవాదు— నా బిడ్డ తండ్రిమీద! నా మనస్సు ఉన్న స్థైర్యాన్నికూడా పోగొట్టుకొని వికావికలై పోయింది!

ఎవరెన్నిచెప్పినా ఆయన కాదనరేం? నా బిడ్డని నేను చంపుకుంటానా, అనరేం? ఆస్తి వాడిపేర నుందని ఆస్తికోసం పాలుతాగే బిడ్డని కాలవపాలు చేస్తావా అని నలుగురూ మీద పడుతూ వుంటే వాళ్ళని చీల్చెయ్యరేం? ... దీన్ని బట్టి నేనేమనుకోడం?

ఈ రెండేళ్ళు కఠిన నరకం అనుభవించాల్సిన ఖర్మ ఆయనకేం పట్టింది?— ఈ బిడ్డ ఆయన బిడ్డ కాదా? నేనాయన సొత్తు కాదా? బిడ్డ సొత్తూ నా సొత్తూ ఆయనిది కాదా?

* * *

ఆ ఆలోచనల్లో విషప్రాయమైన గతమంతా నెమరువేసుకొని, జీర్ణించుకోలేక రాత్రంతా గడిపి ఎప్పుడు నిద్రపోయానో తెలియదు. ఒదిన వచ్చి లేపేవరకూ తెలివిరాలేదు. ఎనిమిదైనట్టుంది. బరువుగాలేచి ముఖం కడుక్కొని మౌనంగా స్నానం ముగించుకున్నాను. అమ్మ అప్పుడే వంటచేసే స్టౌంద సమీపంలో పీటవాల్చుకు కూచున్నాను.

'ఏమంటావమ్మా, చెప్పు.' అంది అమ్మ.

ఆ ప్రశ్నతో దుఃఖం కట్టలుతెంచు



కొని వచ్చింది. ఏడుస్తూ కూచున్నాను. 'ఏడవకమ్మా ఆడజన్మ ఎత్తేకన్నా అడవిలో మానై పుట్టడం మేలనుకొని సీతమ్మ తల్లివంటిది తల్లడిల్లింది ఆడపిల్ల బ్రతుకు అరిటాకులాంటిది. అత్తింటివారు తొందరపడ్డా అరిటాకు, ముల్లు పోలికే.' అని ఏమేమో అమ్మ చెబుతూనే ఉంది.

ఈ పరామర్శతో నామనస్సు - మానేగాయాన్ని పుల్లపెట్టి కదిల్చినట్టయింది. కాలంతో బాటు మరుగున బడ్డ బాబు మూర్తి మళ్ళీ నాకళ్ళెదుట నిల్చినట్టయింది. 'అమ్మా' అని వాడు నావేపు దీనంగా చిలిపిగా చూస్తున్నట్లనిపించింది, పెద్ద దుఃఖం నన్ను ముంచింది.

నా దుఃఖం చూడలేక అమ్మ నన్ను వోదారుస్తూ 'ఊరుకోతల్లీ' ఇందుకే అంటారు; కడుపుచించుకుంటే కాళ్ళ మీద పడుతుందని - నీ కేమంతవయసు మీరిపోయిందని ఈ కడుపుకోత! పెద్ద వాళ్ళమయి మేం యివన్నీ చూడ్డానికే కాబోలు యిలా బతికుండిపోయేం! పోన్లే అమ్మా నువ్వెంతకష్ట

పడి వెళ్ళనేవద్దు. అలాంటి పాషాణంతో కాపరం ఎలాచేస్తావు. వెళితేమట్టుకు! యీ యింట్లో ఏదున్నా ఏది లేక పోయినా, పిడికెడు మెతుకులకి లోటు లేదుగద!' అని - ఇంకేమీ అనలేక పోయింది.

'వెళ్ళకపోడ మేమిటమ్మా. తప్ప కుండా వెళతాను. ఈ దేశంలో వెళ్ళ ననడానికీ వెళతాననడానికీ ఆడదాని కేముంది? మొగుడు రమ్మంటే వెళ్ళి, పొమ్మంటే పోయేతత్వం ఎంతకాల మైనా, భారత స్త్రీకి పోదమ్మా! నన్నిక్కడే మీరు మాత్రం ఎంతకాలం పోషిస్తూ వుంటారు!'

'అంతేనమ్మా చిన్నదానివయినా గ్రహించావు. నా కంతే చాలు. ఇక్క డుంటే దానా దీనా మనస్సు పాడు చేసుకోవడమే గాని మరేం కార్యం లేదు. ఏదో వాళ్ళ కీ నాటికి మనస్సు తిరిగి రమ్మన్నారు గనక వెళ్ళి ఏదో ఆ భగవంతుడి కింకా ఏమేనా దయ మిగిలుంటే నీ కడుపుపండి మరో కాయ కాకపోతే మరో కాయేనా కాస్తుంది?

కాలం జరుగుతున్న కొద్దీ అన్నయ్యా పెద్దకావడం, వాడికీ వో సంసారం రావడం వొదిన యిల్లాలవడం, నాకా యింట్లో చాటునా మాటునా తెలిసీ తెలియకా జరిగే అవమానం యివి కళ్లారా చూస్తూ అమ్మ ఇంతకన్న ఏమనగలదు!

అన్నీ తల్చుకుని తల్చుకుని అమ్మ వొడిలో పడి బావురు మన్నాను.

సాయంత్రానికల్లా ముప్ఫయిమైళ్ల బస్సు ప్రయాణం ముగించుకొని అత్తవారూరు చేరాను. ఉన్నది ఒక్కటే ఆశ. ఆయన మారతారని, మారేరని. రెండేళ్ళ జైలుజీవితం ఆయన్లో ఏం పరిణామం తెచ్చిందో, అది మోడువారిన నా ఆశల్ని తిరిగి చిగురు పెట్టిస్తుందా అని!

వచ్చేవా అనైనా అడక్కుండా అన్నం తిని మేడమీదికి వెళ్ళిపోయే రాయన. తమలపాకుల పళ్ళెం పట్టు కొని మెట్లదాకా వెళ్ళి అక్కడ తోచక నించున్న నన్ను చూసి అన్నయ్యా మొహం తప్పుకున్నాడు. ఎలాగో నాలుగు మెతుకులు తిని చెయ్యి కడు క్కున్నాను. నా వెనకాతలే అత్తగా రొచ్చి 'దిగులు పడకమ్మా నీ మీద కోపమేం లేదు, వాడికి. ఇందాక ట్నించీ చూస్తున్నాను. వాడు తల తీసెయ్యవలసిన తప్పు చేసినా, చెయ్య కున్నా పుట్టెడు దుఃఖాన్నీ మింగుకొని నువ్విలా వచ్చేవంటే వాడీపాటికి సిగ్గు పడవలసింది. మొహ మెలా చెల్లు తుందిలే వాడికి మాత్రం. వెళ్లుపాపం, పన్లు నేచూసుకుంటాన్లే -' అన్నారు. మానవులకు లేని క్షమాగుణం కాలాని కుందా?

అభిజాత్యం అడ్డుపడ్డా మార్గాం తరం లేక ఇరవై నాలుగు మెట్లూ యెక్కాను.

గదిలో ఎవరూ కనపడలేదు. పందిరి మంచం, పరుపూ నన్ను పరామర్శించాయి. ఎదరుగా టేబుల్ మీద బాబుఫొటో, మా పెళ్ళిఫొటో ఉన్నాయి. బట్టల స్టాండున నే వెళ్ళేటప్పుడు మరచిపోయిన గులాబీ జరీ చీర దుమ్ముపడి నల్లపడి అలాగే ఉంది.

యాంత్రికంగా టేబుల్ దగ్గిర కొచ్చేను. ఎదుట వారి డైరీ పెన్నూ కనపడ్డాయి. యదాలాపంగానే పేజీలు తిప్పాను. వారి చదువులు, స్నేహాలు వర్ణిస్తూ వ్రాసుకొన్న పేజీలు తిప్పాను.

నా కళ్ళు అప్రయత్నంగా చదువుకు పోతున్నాయి. ఈ దినం నా వివాహం స్థిరపడింది. నా జీవితం శాంతివనంలో పయనించేటట్టు చేయమని భగవంతుని ప్రార్థిస్తున్నాను.

మరో పేజీ 'రాధఅమాయకురాలు! ఆమెను అన్యాయం చేస్తున్నానని బాధ అనుక్షణం నా గుండెను కాల్చేస్తోంది.'

మరో పేజీ 'ఈరోజు బాబు పుట్టేడని తెలిసింది. మా జీవిత నందనంలో విరిసిన తొలి కుసుమం చిరాయురారోగ్యాంతో వర్ధిల్లాలని భగవంతుని వేడుకుంటున్నాను'

'బాబూ' అని నా గుండె బావురుమంది.

మరో పేజీ 'భగవాన్! నన్ను వ్యసనాల నుండి తప్పించు! రాధకు ముఖం చూపలేను.'... నా కళ్ళు నీళ్ళు ధారకట్టేయి. మసకవారిన మనసుతో మరో పేజీ తిప్పేను. 'నా బాబుని చంపుకున్నాను. 'సుందరి' ఆ రాక్షసి త్రాగించి మతిలేని నన్ను పిచ్చికోతిలా ఆడించింది. నాకు జైలుశిక్ష పడింది. నాకీ శిక్ష చాలదు భగవాన్ చాలదు.' కెవ్వున కేకేసి క్రిందపడిపోయాను, నా అంతరాత్మ రంగులరాట్నంలా తిరిగిపోతోంది, చుట్టూ చిమ్మచీకటి క్రమ్ముకొంది.

తెలివి వచ్చేసరికి మంచంమీద పడుకొని ఉన్నాను, చల్లని చేయి నా నుదుటిమీద ఉంది. కళ్ళు తెరిచేను, క్షమించమనైనా అడగడానికి శక్తి లేక, చేతుల్ని దగ్గరగా జోడించి మళ్లీ కళ్లు మూశాను.

మూతలుపడ్డా నా కంటి చెవుల పైనా నాలుగైదు కన్నీటిచుక్కలు రాలాయి.